

ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కాంతా వర్క్స్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ తో పాటు ఇతర అనేక చేనేత ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని అక్బర్ అలీ పేర్కొన్నారు.



అనాథ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పత్రాలను అందజేస్తున్న మార్గం రాజేష్

అనాథ విద్యార్థులకు రూ.1.75 లక్షల స్కాలర్‌షిప్

ఎల్బీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చైల్డ్‌కేర్ సెంటర్లలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెంగళూరుకు చెందిన గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్ సంస్థ ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆర్కేపురం చిత్రాలేఅవుట్‌కాలనీలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ మాట్లాడుతూ, తమ విద్యార్థి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఏడుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. వారిని సంస్థ గుర్తించి ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున రూ.1.75 లక్షలు అందజేశారన్నారు. ప్రతిభకనబర్చిన విద్యార్థుల్లో వివిధ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివిన ఎన్.ప్రశాంత్, ఆర్.ఈశ్వర్, ఎ.స్టీవెన్సన్, కె.విఘ్నేష్‌తో పాటు వివిధ పాఠశాలల్లో టెన్త్ చదివిన పి.బాలేష్, ఆర్.చరణ్, ఆర్.నిఖిల్ ఉన్నారన్నారు. వీరికి తమ అనాథ గృహంలో స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన పత్రాలను అందించామన్నారు.



పసికందుకు ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్ అందిస్తున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి

తల్లిని కోల్పోయిన పసికందుకు ఆర్థిక సాయం

మన్సూరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తల్లిని కోల్పోయిన పసికందుకు మన్సూరాబాద్ బీఆర్ఎస్ పార్టీ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందించారు. డివిజన్ పరిధిలోని డబుల్‌బెడ్రూంలో నివసించే బాలెముల వేణు, దీపిక దంపతులు. దీపిక ప్రసవం సమయంలో బిడ్డకు జన్మనిచ్చి తన ప్రాణాలు కోల్పోయింది. విషయం తెలుసుకుని చలించిన జక్కిడి రఘువీర్‌రెడ్డి తన కార్యాలయంలో పసికందు సంరక్షణ నిమిత్తం తనవంతుగా కొంత ఆర్థిక సాయం, స్వయంగా చేయించిన 'గిఫ్ట్ ఏ స్మైల్ కేసీఆర్ కిట్‌ను తండ్రి వేణు, బంధువులకు అందజేయడంతో పాటు భవిష్యత్తులో పాపకు తనవంతుగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.



ఫిర్యాదు దారుడి నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న డీఎల్‌పీవో

ఇనాంగూడలో అక్రమ లేఅవుట్ పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామ సర్వే నంబర్ 57లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను గురువారం డీఎల్‌పీవో సాధనరెడ్డి పరిశీలించారు. సదరు సర్వే నంబర్‌లో గేటెడ్ కమ్యూనిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఔట్ ఏర్పాటు చేశారని, అందులోని నిర్మాణాలకు పంచాయతీ అధికారులు అక్రమంగా ఇంటి నంబర్లను కేటాయించారని పేర్కొంటూ గత నెల వెంకటేష్‌గౌడ్ డీఎల్‌పీవోకి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం సాధనరెడ్డి పంచాయతీ అధికారులతో కలిసి సదరు లేఔట్, అందులోని నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. లేఅవుట్, ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా అని పంచాయతీ అధికారుల ద్వారా రికార్డులను పరిశీలించారు. అదే విధంగా ఫిర్యాదు దారు వెంకటేష్ నుంచి మరిన్ని వివరాలను నమోదు చేసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో తెలిపినట్లు వెంకటేష్ చెప్పారు.

ఓల్డ్ మలక్‌పేటలో రైతు శిక్షణా కేంద్రం సందర్శన



ల్యాబ్ పరికరాలను పరిశీలిస్తున్న నరసింహారావు

ఓల్డ్ మలక్‌పేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ మలక్‌పేటలోని రైతు శిక్షణా కేంద్రాన్ని గురువారం వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ నరసింహారావు సందర్శించారు. కార్యాలయంలోని వ్యవసాయ ఉత్పత్తులు, నూతన పద్ధతులకు సంబంధించిన ల్యాబ్ పరికరాల పనితీరు వివరాలను సంబంధిత ల్యాబ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతు శిక్షణ కేంద్రంలో శిథిలావస్థకు చేరి వర్షాలకు కురుస్తున్న భవనాలను ఆయన పరిశీలించారు. శిక్షణా కేంద్రంలోని భవనాల మరమ్మతులకు ప్రతి పాదనలు సిద్ధం చేసి అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బడ్జెట్ విడుదల కాగానే రైతు శిక్షణ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన వ్యవసాయ పద్ధతుల్లో రైతులను ప్రోత్సహించేందుకు శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. త్వరలోనే రైతు శిక్షణ కేంద్రానికి పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. ఆయన వెంట శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గోభక్తులపై దాడి చేస్తారా?

- గోవుల తరలింపును అడ్డుకున్న వ్యక్తిపై కాల్పులు జరిపిన వ్యక్తిని శిక్షించాలి
- డీజీపీ కార్యాలయం వద్ద బీజేపీ నాయకుల నిరసన



జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డిని కు తరలిస్తున్న పోలీసులు



కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నిరసన చేపడుతున్న చింతల సురేంద్రనాథ్‌ను డీసీఎంలో తరలిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోరక్షకులపై దాడి చేసిన ఎంఐఎం నాయకుడు, అతడికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని డీజీపీ కార్యాలయం వద్ద రాష్ట్ర బీజేపీ నాయకులు గురువారం చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్‌యాదవ్ మాట్లాడుతూ గోమాత రక్షణకు పాటుపడుతున్న గో భక్తులపై జరిగిన దాడి హేయమని, ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. ఇలాంటి ఘటనలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కారకులను శిక్షించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసనలో నాగోల్ బీజేపీ నాయకుడు బద్దం బాలకృష్ణగౌడ్, బీజేవైఎం నాయకులు వినోద్‌యాదవ్, సంతోష్‌కుమార్, మనోజ్‌కుమార్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

కొత్తపేటలో..

కొత్త పేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోచారం పీఎస్ పరిధిలో గోవుల తరలింపును అడ్డుకున్న ప్రశాంత్ కుమార్‌పై ఇబ్రహీం అనే వ్యక్తి కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ చేపట్టిన ధర్నాలో పాల్గొన్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్వర్యంలో లక్డీకపూల్ డీజీపీ కార్యాలయంవద్ద ధర్నా చేపట్టారు. ధర్నాలో కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి



ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి

కొత్త పేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి అన్నారు. గురువారం ఆయన టీటీఐ అధికారులు 17 ప్రాంతాల్లో చేపట్టిన అవగాహన కార్యక్రమాలను వివరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మంచాల్, మాల్ మర్రిగుడ రోడ్, సాగర్ రోడ్, మాడ్గుల మండల గ్రామ పంచాయతీ కార్యాలయం, మాడ్గుల పరిధిలో నర్సాయపల్లి గ్రామం, ఎల్లమ్మ కాలనీ, అంబేద్కర్ క్రాస్ రోడ్స్‌లో వాహనదారులకు, ప్రజలకూ 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమాల్లో 409 మందికి ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఏఎస్ఐ సోమ్‌నాథ్ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారన్నారు. నిబంధనలను తెలుగు, ఇంగ్లిష సూచనలతో రూపొందించిన కరపత్రాలను వాహనదారులకు పంపిణీ చేశారు.

మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడకండి అంటూ టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి, ఇన్ స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్ రెడ్డి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 50 మంది మద్యం ప్రియులకు 50 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్‌హాల్‌లో 2 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో మద్యం మత్తులో వాహనాలు నడపడంతో చోటుచేసుకున్న ప్రమాదాల వీడియో క్లిప్పులను ప్రదర్శించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాస్తవంగా పరిస్థితి ఎలా ఉంటుందో వీడియోల్లో గమనించాలని సూచించారు. మత్తులో వాహనాల డ్రైవింగ్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం కోసం సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలను ప్రదర్శించారు.

పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన కేసులో వ్యక్తికి జైలు



ముజాహిద్

సంతోష్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరాల ప్రకారం.. ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌరస్తా వద్ద 21వ తేదీన సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ వెంకటప్ప సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాడు. కాగా అదే సమయంలో ఈదీబజార్‌కి చెందిన మహ్మద్ ముజాహిద్(27) మొబైల్ టెక్నీషియన్ ద్విచక్రవాహనంపై అక్కడికి రాగా ట్రాఫిక్ పోలీసులు వాహనం తనిఖీ చేస్తుండగా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడి పోలీసు విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై ఐఎస్ సదన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ముజాహిద్‌పై పెట్టీ కేసు నమోదు చేశారు. గురువారం నాంపల్లి 7వ మెట్రోపాలిటన్ స్పెషల్ కోర్టులో హాజరు పరచగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ముజాహిద్ కు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు.

దాడి ఘటనలో యువకుడికి మూడు రోజుల జైలు



నిందితుడు ఆకాష్

చాదర్‌ఘాట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య జరిగిన గొడవలో దాడికి కారకుడైన యువకుడిపై నమోదైన కేసులో గురువారం నాంపల్లిలోని 8వ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కరీమ్నాబాద్‌కు చెందిన ఎ.ఆకాష్ (25) జెప్టోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 19న మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకాష్, సంతోష్‌ల మధ్య గొడవ జరిగి.. ఆకాష్ సంతోష్‌పై చేయి చేసుకున్నాడు. సంతోష్ ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి ఆకాష్‌ను కోర్టుకు తరలించారు. నాంపల్లిలోని 8వ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ మురళి ఆకాష్‌కు జైలు శిక్ష విధించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భీంరాజ్

హయత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హయత్‌నగర్ వీరన్నగుట్టకు చెందిన భీంరాజ్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని ఆయన భీంరాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భీంరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు తమ పోరాటం ఆగదని తెలిపారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యమ నేతలు

బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలి

మన్సూరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడమే లక్ష్యంగా శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద బీసీ మహాధర్నా కరపత్రాలను బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యమ నేతలు మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ టి.చిరంజీవులు అధ్యక్షతన చేపట్టే మహాధర్నాలో వివిధ పార్టీల బీసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు విచ్చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకులు బొమ్మ రఘురాంనేత, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు చామకూర రాజు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమళ్ల రాంనర్సింహాగౌడ్, తదితరులు ఉన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్యకి పరామర్శ



మొగులయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కిన్నెర కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యను గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి, ఈదమ్మల బలరాం హయత్‌నగర్‌లో కలిసి పరామర్శించారు. హయత్‌నగర్ కుంట్లూర్ రోడులో అప్పటి ప్రభుత్వం మొగులయ్యకు కొంత స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలాల విషయంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మొగులయ్యను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయంలో ఆయనకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు.



సదస్సులో పాల్గొన్న ఓయూ వీసీ, ప్రొఫెసర్లు, కంపెనీ ప్రతినిధులు

ఐటీ కన్నా.. ప్రాథమిక ఇంజనీరింగ్ బెటర్

పరిశ్రమ-విద్యా సదస్సులో ఐఏఎస్ భవేశ్ మిశ్రా

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఐటీ ఉద్యోగాల కన్నా ప్రాథమిక ఇంజనీరింగ్ రంగాల్లోనే కొనసాగాలని తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఈఅండ్‌సీ విభాగం ఉప కార్యదర్శి భవేశ్ మిశ్రా సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల (యూసీఈ), ఫోటోనిక్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి "ఇండస్ట్రీ-అకాడెమియా కాన్‌క్లేవ్ ఆన్ సెమీకండక్టర్స్" పేరుతో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా వర్చువల్‌గా హాజరై మాట్లాడారు. భారత్ సెమీకండక్టర్ మిషన్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటు వంటి చర్యలను వివరించారు. ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటి నుంచే నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, పరీక్షల్లో మార్కుల కంటే నైపుణ్యాలే ముఖ్యమని సూచించారు. స్వదేశీ చిప్ రూపకల్పన భారత స్వావలంబనకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. "చిప్ టు స్టార్టప్ (సీ2ఎస్)" పథకంలో ఓయూ తీసుకుంటున్న అడుగులు, వీఎల్ఎస్ఐ సాధనాల వినియోగం వంటి అంశాలను యూసీఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ వివరించారు. సైనాప్సిస్ ఇండియా - ఓయూ మధ్య విద్యా-పరిశ్రమ సహకార ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ సదస్సు ద్వారా ఓయూ పరిశ్రమలతో అనుసంధానం బలోపేతం చేసి, స్వదేశీ చిప్ రూపకల్పనలో మరో అడుగు ముందుకు వేసింది.


ఈటలను కలిసిన ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రజలు

మల్కాజిగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌కు చెందిన పలు కాలనీల ప్రజలు బీజేపీ నాయకులు బక్కనాగరాజు ఆధ్వర్యంలో గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటలను కలిసి తమ సమస్యలు వివరించారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదని ఎంపీకి కాలనీ ప్రజలు వివరించారు. స్పందించిన ఎంపీ వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రేం విజయ్‌నగర్ కాలనీ, వసంతపురి కాలనీ, షిర్డీనగర్ కాలనీ, కల్యాణ్‌నగర్ కాలనీలకు చెందిన హరిరాజు, ఆశ, పద్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ షోను ప్రభుత్వం నిషేధించాలి

త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తాం : సామాజిక కార్యకర్తలు

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ షోను ప్రభుత్వం నిషేధించాలని గజ్వేల్ సామాజిక కార్యకర్తలు కమ్మరి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరుకు చెందిన సుకుమారెడ్డిలు డిమాండ్ చేశారు. త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిగ్‌బాస్ షో పై ఈ నెల 16న జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ నెల 21న నగర పోలీసు కమిషనర్ సజ్జనార్‌ను కలిసి విన్నవించినా ఇప్పటివరకు స్పందన లేదని ఆరోపించారు. బిగ్‌బాస్ షోలో సన్నివేశాలు అసభ్యకరంగా ఉంటున్నాయని, దానిలో చూపిస్తున్న ఆటలు విలువలను నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. మహిళా, ప్రజా సంఘాలు తమ పోరాటానికి అండగా ఉంటున్నాయన్నారు. దాన్ని చూడడం వల్ల విద్యార్థులు, యువత పెడదోవ పడుతుందన్నారు. అసభ్యకరమైన సన్నివేశాలు చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిగ్‌బాస్ షోను నిషేధించేంతా వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్‌కు చెందిన శ్రీలాన్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒలింపియన్స్ కిడ్స్ వింటర్ గేమ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గురువారం ఎల్బీ.స్టేడియంలో ఫ్యూచర్ ఒలింపియన్స్ కిడ్స్ వింటర్ గేమ్స్ - 2025 పోస్టర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోని బాలాదేవితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నవంబర్ 22, 23వ తేదీలలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఫ్యూచర్ ఒలింపియన్స్ ఆధ్వర్యంలో కిడ్స్ వింటర్ గేమ్స్ - 2025 జరగనున్నాయన్నారు. ఒలింపిక్స్ తరహా పోటీలను చిన్న పిల్లలకు అర్థమయ్యేలా ఆసక్తి గల క్రీడా అంశాలలో వారు రాణించే విధంగా సంస్థ ఆలోచించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి నరసింహ తదితరులు

పాషా, నరహరి వర్ధంతి సభను విజయవంతం చేద్దాం : సీపీఎం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఉద్యమ నిర్మాతలు, భూమి, కూలీ పోరాట యోధులు పాషా, నరహరి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 26న ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ తెలిపారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న నిర్వహించనున్న పాషా, నరహరి వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారి పోరాటాలు నేటికి ప్రజలు స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెండు శివకుమార్, ముత్యాలు, శ్రీశైలం, బిక్షపతి, శివ, శ్రీనివాస్, జంగయ్య, మహేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో పీఈటీ అనిత

పవర్ లిఫ్టింగ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

మౌలాలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలలో మౌలాలిలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల సనత్‌నగర్-1 శాఖలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని జియాగూడలో ఇటీవల జరిగిన 69వ ఎస్‌పీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ (రాష్ట్రస్థాయి) అండర్-19 పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలలో 53 కేజీల విభాగంలో కీర్తన, 68 కేజీల విభాగంలో లావణ్య వెండి పథకాలను, 72 కేజీల విభాగంలో అమీనాబేగం కాంస్య పథకాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ మాధవిరెడ్డి తెలిపారు. చదువుతోపాటు క్రీడలలో రాణించేలా శిక్షణ అందిస్తున్నామని తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలువడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్మార్ట్ వర్క్ కూడా నేర్చుకోవాలి

నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కఠిన శ్రమతో పాటు "కొంచెం స్మార్ట్ వర్క్" కూడా నేర్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల (అటోనమస్), ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన గ్రీన్ ఊర్జా టెక్నాలజీస్ అండ్ సిస్టమ్స్ (జీయూటీఎస్) సహకారంతో "సోలార్ పీవీ టెక్నాలజీస్ - ఇన్‌స్టలేషన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌"పై నాలుగు వారాల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది.నవంబర్ 17 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఓయూలో పరిశోధన, ఆవిష్కరణలు, మౌలిక వసతుల బలోపేతానికి విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని, అధ్యాపకులు క్యూ1, క్యూ2 జర్నల్స్‌లో పబ్లికేషన్ చేయడానికి ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ ఊర్జా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ కుమార్ దేశ్‌పాండే, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.మంగు, తదితరులు పాల్గొన్నారు.